

వెంకటాపూర్ : పరదాలపై నిలిచిన వర్షపు నీరు

# అకాల వర్షంతో రైతు ఆగం

**తడిసి ముద్దయిన ధాన్యం రాశులు**

ములుగురూరల్/వెంకటాపూర్/గోవిందరావుపేట/వాజేడు/కన్నాయిగూడెం/ గోవిందరావుపేట/ భూపాలపల్లి రూరల్, మే 14 : మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం 5గంటల వరకు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ఆయా మండలాల్లో కురిసిన వర్షానికి రైతులకు తీరని నష్టం కలిగింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షంతో రైతులు ఆగమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం రాసులపై కప్పి ఉంచిన పరదాలు ఈదురు గాలులకు కొట్టుకుపోయాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాత్రి సమయంలో రైతులు తమ ధాన్యం రాశులు తడువకుండా ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడవటంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. వర్షంతో వాజేడు మండలానికి వచ్చే 33కేవీ విద్యుత్‌లైన్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతోపాటు వెంకటాపురం 132 కేవీలో బ్రేక్‌డౌన్ అయ్యింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. వాజేడు ఏఈ అర్షద్ అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టి మధ్యాహ్నం వరకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. భూపాలపల్లి జిల్లా పరిధిలోని చిట్యాల మండలంలో 1.6 మి.మీ, టేకుమట్లలో 4.2 మి.మీ, మొగుళ్లపల్లిలో 7.8 మి.మీ, గణపురం మండలంలో 5.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



ములుగులో కొట్టుకుపోయిన ధాన్యం



గోవిందరావుపేట : దుంపెల్లగూడెంలో తడిసిన ధాన్యం



గణపురం : కొనుగోలు కేంద్రం వద్ద..



వరదలో మునిగిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగజ్యోతి

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

**ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి**

ఏటూరునాగారం, మే 14 : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, బాయిల్డ్ రైస్ మిల్లర్లకు సరఫరా చేయాలని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. మండలంలోని గోగుపల్లిలో ఊరవాగు వరదలో మునిగిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నాగజ్యోతి సందర్శించి రైతులను పరామర్శించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రైతులకు వర్షంపై ముందస్తు సమాచారం లేకపోవడం వల్లనే నష్టం జరిగిందన్నారు. రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ములుగులో ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో రైతులను ఆదుకోకుండా అందాల పోటీలకు రూ.200కోట్లు ఖర్చు పెట్టడం ఏమిటంటూ మండిపడ్డారు. రైతులకు న్యాయం చేయకుంటే కలెక్టరేట్, మంత్రి క్యాంపు ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాగజ్యోతి వెంట బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, తాడూరి రఘు, కోనేరు నగేశ్, మాజీ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, మాదిరి రామయ్య, ఈసం రామ్మూర్తి, వావిలాల పోషయ్య, గండపెల్లి నర్సయ్య, కుమ్మరి చంద్రబాబు, గోస్కుల రాంబాబు, కాళ్ల రామకృష్ణ, రాజశేఖర్, సమ్మిరెడ్డి, వెంకన్న శ్రీనివాస్, బత్తుల ఉమ, ఈసం సమ్మయ్య, సారయ్య పాల్గొన్నారు.

# సరస్వతీ పుష్కరాల్లో అప్రమత్తంగా ఉండాలి

- భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ
- కాళేశ్వరంలో అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మహదేవపూర్(కాళేశ్వరం), మే 14 : సరస్వతీ పుష్కర విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. బుధవారం ఆయన కాళేశ్వరంలో పర్యటించారు. అనంతరం దేవస్థానంలోని కల్యాణ మండపంలో పుష్కరాల విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల్లో భాగంగా 12రోజులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మన జిల్లాలో పెద్ద ఎత్తున సరస్వతీ పుష్కరాలు జరుపుతున్నామని, అందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజు లక్షకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 15వ తేదీన (నేడు) ఉదయం పుష్కరాలు ప్రారంభమవుతాయని, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పుష్కరాలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సరస్వతీ మాత విగ్రహం ఆవిష్కరణ, పుష్కర స్నానం తదుపరి స్వామి వారి దర్శనం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. అనంతరం టెంట్ సిటీని పరిశీలిస్తారన్నారు. కాశీ పండితులతో ప్రత్యేకంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుంభమేళాకు వెళ్లలేని వారు ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. సరస్వతీ మెయిన్ ఘాట్ వద్ద భక్తులకు స్నానాల షవర్లు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిండ ప్రదాన కార్యక్రమాలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అధికారులు వీఐపీ ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌కి వచ్చిన సమస్యను తక్షణమే ఆయా శాఖల అధికారుల దృష్టి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 50మంది గజ ఈతగాళ్లు నాటు పడవలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా 30షటిల్ బస్సులు నడుపుతున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విధులు కేటాయించిన సిబ్బందికి భోజన, వసతి ఏర్పాటు చేస్తున్నామని, సమయపాలన పాటించాలని సూచించారు. సమావేశంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీవో రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం కాళేశ్వరం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. బుధవారం ఎస్పీ కిరణ్‌ఖరే, సీఎం భద్రతా అధికారి వాసుదేవరెడ్డితో కలిసి కాళేశ్వరంలో ఈవో కార్యాలయంలో సీఎం భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హెలికాప్టర్ ద్వారా గురువారం సాయంత్రం 5గంటలకు కాళేశ్వరం చేరుకుంటారని తెలిపారు. సీఎం ప్రయాణించే మార్గంలో పోలీస్ బందోబస్తు, బాంబ్ స్క్వాడ్, ట్రాఫిక్ కంట్రోల్, ఆయా విభాగాల సమన్వయంతో భద్రతా చర్యలు పర్యవేక్షించాలన్నారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాల సేవలు వినియోగించనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

### ప్రత్యేక ఆకర్షణగా హ్యాండ్లూమ్ స్టాళ్లు

సరస్వతీ పుష్కరాల సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సరస్వతీ పుష్కరాల సందర్భంగా హ్యాండ్లూమ్, టెక్స్ టైల్ ఉత్పత్తుల స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకునేలా కలెక్టర్ ఏర్పాటు చేశారు. స్టాళ్ల పర్యవేక్షణకు డీఆర్డీవో నరేశ్, పరిశ్రమలశాఖ జీఎం సిద్ధార్థలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు తమ కృషిని ప్రతిబింబించేలా తయారు చేసిన నాణ్యమైన హస్తకళా ఉత్పత్తులు, సేంద్రియ ఆహార పదార్థాలు, పచ్చళ్లు, ఇతర గ్రామీణ ఉత్పత్తులను విక్రయించనున్నారు.



వంద గదుల సత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## అంగరంగ వైభవంగా సరస్వతీ పుష్కరాలు

- మంత్రి శ్రీధర్‌బాబు
- కాళేశ్వరంలో వంద గదుల సత్రం ప్రారంభం

మహదేవపూర్(కాళేశ్వరం), మే 14 : అంగరంగ వైభవంగా సరస్వతీ పుష్కరాలు నిర్వహించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. బుధవారం రాత్రి కాళేశ్వరంలోని సరస్వతీ ఘాట్ తదితర ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం రూ.12కోట్లతో నిర్మించిన వంద గదుల సత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురువారం సాయంత్రం 5గంటలకు సీఎం రేవంత్ రెడ్డి పుష్కరాల నిర్వహణలో భాగంగా సరస్వతీ మాత విగ్రహావిష్కరణ, ఘాట్లు, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి గోదావరి హారతిని సరస్వతీ ఘాట్ ఆవరణలో కాశీ దీక్షిత్ పండితులు, స్థానిక బ్రాహ్మణోత్తముల చేతుల మీదుగా ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. పుష్కరాలకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్దఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్రావు పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈవో మహేశ్ పాల్గొన్నారు.

## కొండపర్తిని సందర్శించిన గవర్నర్ సెక్రటరీ

తాడ్వాయి, మే 14 : గవర్నర్ దత్తత గ్రామం కొండపర్తిని బుధవారం గవర్నర్ పర్సనల్ సెక్రటరీ పవన్‌సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా దత్తత గ్రామంలో ఆదివాసీ మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉపాధి అవకాశాలు, మిల్లులు, మసాలాల మేకింగ్‌తోపాటు ప్యాకింగ్‌యూనిట్‌ను సందర్శించారు. మహిళలు పొందుతున్న ఉపాధి, ఆర్థిక లాభాలను అడిగి తెలుసుకున్నారు. మరిన్ని అవకాశాలు కల్పించేందుకు తాము గ్రామంలో పర్యటించామని తెలిపారు. వారివెంట బాలవికాస మేనేజర్ తిరుపతి, ఎంపీడీవో సుమణవాణి తదితరులున్నారు.

## వైద్యాధికారుల పోస్టులకు దరఖాస్తులు

ఏటూరునాగారం, మే 14: ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఏజెన్సీ మండలాల్లో వైద్య విభాగం జాతీయ ఆరోగ్య మిషన్ కింద కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాల్లో ఖాళీగా ఉన్న మాతా శిశు ఆరోగ్య ఎపిడమిక్ బృందాల వైద్యాధికారుల(సివిల్ అసిస్టెంటు సర్జన్)పోస్టుల్లో కాంట్రాక్టు పద్ధతిన పని చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు మల్టీజోన్ పరిధిలోని వారై ఉండాలన్నారు. ఈ పోస్టుకు ఎంబీబీఎస్ చదివి మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలన్నారు. వచ్చే జూలై 1వ తేదీ నాటికి 46యేళ్లలోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోగా ఐటీడీఏలోని తన కార్యాలయంలో జిరాక్స్ ప్రతులను అందజేయాలని సూచించారు.

## పుట్ట మధును విమర్శించడం సరికాదు

**బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్**

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 14 : కాంగ్రెస్ నాయకులు మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధును విమర్శించడం సరికాదని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్ అన్నారు. పుట్ట మధు ప్రోద్బలంతో పదవులు అనుభవించి ఎలక్షన్ సమయంలో పార్టీ మారి ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న పుట్ట మధుపై ఆరోపణ చేయడం సిగ్గుచేటన్నారు. పుట్ట మధును విమర్శించే ముందు ప్రస్తుత ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నిస్తే ప్రజలు హర్షిస్తారని కిరణ్ హితవు పలికారు.

## ప్రమాదవశాత్తు వాగులో పడి మహిళ మృతి

వెంకటాపురం(నూగూరు), మే 14 : మండల కేంద్రంలోని శివాలయం వీధికి చెందిన వివాహిత మహిళ ప్రమాదవశాత్తు కంకలవాగులో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శివాలయం వీధికి చెందిన పానెం పద్మావతి(42) ఈ నెల 13వ తేదీ తెల్లవారుజామున బహిర్భూమికి ఇంటి వెనక ఉన్న కంకలవాగు వద్దకు వెళ్లింది. కాగా ప్రమాదవశాత్తు కాలు జారి కంకలవాగులో పడి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

ఏటూరునాగారం, మే 14 : భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి కోరారు. మండలంలోని గోగుపల్లిలో తడిసిన ధాన్యాన్ని బుధవారం సీపీఎం నాయకులు సందర్శించి రైతులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఊరవాగు సమీపంలోని కొనుగోలు కేంద్రంలో సుమారు 50మంది రైతులకు చెందిన ధాన్యం ఊరవాగు వరదకు కొట్టుకుపోయి నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వడకాపురం సారయ్య, యాకూబ్, రామిరెడ్డి, ఈసం నారాయణ, వేణు, రైతులు పాల్గొన్నారు.

## 20న సమ్మెను విజయవంతం చేయాలి

కృష్ణకాలనీ, మే 14 : కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సింగరేణి కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం భూపాలపల్లి ఏరియాలోని స్థానిక కొంరయ్య భవన్‌లో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, సీఐటీయూ జనరల్ సెక్రటరీ మంద నర్సింగరావు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేశ్, ఐఎన్ టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు నల్లబెల్లి సదానందం, కుమార్, మల్లారెడ్డి, సురేశ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు, సతీశ్‌కుమార్, సీఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య, ఐఎన్టీయూసీ నాయకులు అశోక్, ఐఎఫ్ టీయూ నాయకులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సింగరేణి జేఏసీ నాయకులు

## వెంకట్రావ్‌పల్లిలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

**పాల్గొన్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే**



పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

టేకుమట్ల, మే 14 : మండలంలోని వెంకట్రావ్‌పల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారీలు వేర్వేరుగా హాజరై ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోచమ్మ తల్లి కరుణాకటాక్షాలతో వర్షాలు సంవృద్ధిగా కురిసి, వాతావరణం అనుకూలించి, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, పిల్లాపాపలతో, పాడి పంటలతో సుభీక్షంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, గ్రామ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### భరత్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

మల్హర్, మే 14 : కేటీఆర్ సేన జయశంకర్ జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం భరత్‌రెడ్డి స్వగ్రామమైన మల్హర్‌రావు మండలం నాచారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటకం జనార్దన్, కేటీఆర్ సేన నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నింటి మణిదీప్‌రావు, జిల్లా నాయకులు పిన్నింటి శ్రీనివాస్‌రావు, పట్టణ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, గండ్ర యువసేన జిల్లా నాయకులు శ్రీకాంత్ పటేల్ పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి

**ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి సీతక్క**



ట్రై సైకిళ్లను అందిస్తున్న మంత్రి, కలెక్టర్

ములుగురూరల్, మే 14 : దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి దనసరి సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా సంక్షేమ అధికారి శిరీష అధ్యక్షతన జిల్లాకు చెందిన ఆరుగురు దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లను కలెక్టర్ దివాకరతో కలిసి మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు మహేదర్‌జీ, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచాలి

గోవిందరావుపేట : ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచాలని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఈవో జీ పాణిని, కోర్సు కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి, సెంటర్ ఇన్‌చార్జీలు అప్పని జయదేవ్, అర్షం రాజు, గుల్లపెల్లి సాంబయ్య, ఎంఈవో గొంది దివాకర్, డీఆర్పీలు, సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో కోవర్టులకు స్థానం లేదు

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

మొగుళ్లపల్లి, మే 14 : కాంగ్రెస్ పార్టీలో కోవర్టులకు స్థానం లేదని, అటువంటి వారు పార్టీ నుంచి వెళ్లిపోతే మంచిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథులుగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, మాసంపెల్లి లింగాజి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, కటంగురి రాంనరసింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్‌గౌడ్, జిల్లా నాయకులు తక్కళ్లపల్లి రాజు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

టేకుమట్ల, మే 14 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20మంది లబ్ధిదారులకు రూ. 11,50,000 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలో అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్‌గౌడ్, సంస్థాగత ఎన్నికల పరిశీలకులు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, మాసంపల్లి లింగాజీ, కటంగూరి రాంనర్సింహరెడ్డి పాల్గొన్నారు.

## వందశాతం ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలి

**కేటీకే-5 ఇంక్లైన్ గని మేనేజర్ ఎండీ హుస్సేన్**

కృష్ణ కాలనీ, మే 14 : సింగరేణి ఉద్యోగులు 100 మస్టర్లు అనే గణాంకాన్ని ప్రామాణికంగా తీసుకోవడం మానేసి, ప్రతిరోజు సక్రమంగా విధులకు హాజరై వందశాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని కేటీకే-5ఇంక్లైన్ గని మేనేజర్ ఎండీ జాకీర్ హుస్సేన్ ఆదేశించారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశాల మేరకు, ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి సూచనలతో బుధవారం 2024సంవత్సరంలో 100నుంచి 191మధ్య మాస్టర్లు మాత్రమే చేసిన ఉద్యోగులకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని కేటీకే-5 ఇంక్లైన్ గని ఆవరణలో సంబంధిత ఉద్యోగుల కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ ఎండీ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులు "100 మస్టర్లు" అనే గణాంకాన్ని హాజరులో ప్రామాణికంగా తీసుకోవడం మానేయాలన్నారు. విధిగా హాజరయ్యే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్‌కుమార్, గుర్తింపు సంఘం పిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి, ప్రతినిధి సంఘం పిట్ సెక్రటరీ చుంచుల గట్టురాజు, క్లర్క్ రవి పాల్గొన్నారు.

### ఏజీఎంకు స్వాగతం పలికిన జీఎం

సింగరేణి భూపాలపల్లి ఏరియాకు నూతనంగా ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్ నుంచి బదిలీపై వచ్చిన ఏజీఎం (ఈఅండ్ ఎం) మాల ఎర్రన్నకు బుధవారం భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తన ఛాంబర్‌లో పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. గతంలో భూపాలపల్లి ఏరియా ఇంజినీర్‌గా పని చేసిన రామకృష్ణారెడ్డి మార్చి 31న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆ స్థానంలో ఎర్రన్నను నియమిస్తూ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఎర్రన్న ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతీ పాల్గొన్నారు.

## జీవో నం3ను పునరుద్ధరించాలి

వెంకటాపురం(నూగూరు), మే 14 : జీవో నంబర్-3ను పునరుద్ధరించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్యకార్యకర్తల సమావేశం పూనెం ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు. పూనెం సాయి హాజరై మాట్లాడారు. రాష్ట్ర పునర్విభజనలో షెడ్యూల్డ్ ఏరియాను చిన్నాభిన్నం చేసి ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. సమావేశంలో బాబురావు, విజయ్, రాజు, కృష్ణార్జునరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే పోలీసుల లక్ష్యం

**అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్**

గోవిందరావుపేట, మే 14 : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోలీసులు పని చేయాలని తెలంగాణ స్పెషల్ పోలీస్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ అన్నారు. మండలంలోని చల్వాయి క్రాస్ వద్ద ఉన్న 5వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియంలో నూతనంగా నిర్మించిన పలు భవనాలను బుధవారం సంజయ్‌కుమార్ ప్రారంభించారు. విధి నిర్వాహణలో భాగంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం బెటాలియన్ పోలీసులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సుబ్రమణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ అనిల్‌కుమార్, ఆర్ఐలు శోభన్‌బాబు, కార్తీక్, సల్మాన్‌రాజ్, శ్రీనివాసాచారి, రాంప్రసాద్, స్వామితోపాటు పాల్గొన్నారు.

## సరస్వతీ పుష్కర కమిటీ ప్రమాణ స్వీకారం

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 14 : ఈనెల 15నుంచి 26వరకు జరుగనున్న సరస్వతీ నది పుష్కరాలకు కాళేశ్వరం దేవస్థానంలో ఉత్సవ కమిటీని 14మంది సభ్యులతో దేవాదాయ శాఖ నియిమించగా బుధవారం ఆలయంలో ప్రమాణం స్వీకారం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో మహేశ్, ఉత్సవ కమిటీ చైర్మన్ మోహనశర్మ అవధాని, సభ్యులు మంచినీళ్ల దుర్గయ్య, జల వంచ సీతారాం, గందెసిరి సత్యనారాయణ, కుంభం పద్మ, బీసుని నర్సయ్య, బండారి నర్సింగరావు, ముక్కెర రాజమల్లుగౌడ్, మేకల ఓదెలుయాదవ్, భూపల్లి రాజయ్య, దండ ప్రశాంత్‌రెడ్డి, ఓదెల కుమారస్వామి, అడ్డూరి శ్రీధర్‌రావు పాల్గొన్నారు. 12రోజులపాటు కమిటీ ఉండనుంది. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


## ప్రభుత్వ దవాఖానలో యువకుడి అనుమానాస్పద మృతి

ములుగు, మే14(నమస్తేతెలంగాణ) : ప్రభుత్వ దవాఖానలో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో బు ధవారం చోటు చేసుకుంది. మృతుడి తల్లి లచ్చమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లంపల్లి మండలకేంద్రానికి చెందిన కందె రాజు(20) మంగళవారం రాత్రి చేతిని కోసుకోగా ములుగు ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చారు. చికిత్స నిర్వహించిన వైద్యులు దవాఖానలో ఉండాలని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం తాను మల్లంపల్లికి వెళ్లి వచ్చే సరికి మృతి చెంది ఉన్నాడని లచ్చమ్మ వివరించింది. కాగా, రాజు దవాఖాన మెట్లు ఎక్కే క్రమంలో కాలు జారి కింద పడి చనిపోయాడా..? లేక ప్రభుత్వ దవాఖాన భవనం మీద నుంచి దూకి చనిపోయాడా..? అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయమై సూపరింటెండెంట్‌ను ఫోన్‌లో వివరణ కోరగా మృతి చెందిన వ్యక్తి దవాఖానకు మంగళవారం రాత్రి వచ్చిన విషయం వాస్తవమేనని, అయితే అతను ఇన్ పేషంట్‌గా లేడని అన్నారు. దవాఖాన మెట్ల ముందు ఉన్న ఖాళీ స్థలంలో కింద పడి చనిపోయి ఉండగా మృతదేహాన్ని మార్చురీకి తరలించామని తెలిపారు.

## తూకం వేసిన వడ్లను త్వరగా తరలించాలి

మల్హర్, మే 14 : తూకం వేసిన వడ్లను వెంటనే తరలించాలని డీసీవో వాల్యానాయక్ సహకార సంఘం సిబ్బందికి సూచించారు. మండలంలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో కొండంపేట, వల్లెకుంట, కొయ్యూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం డీసీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తూకమైన వెంటనే వడ్లను మిల్లులకు తరలించి ట్రక్ సీట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




సమ్మక్క కుటుంబానికి నగదు అందిస్తున్న క్రాంతికుమార్

వాజేడు, మే 14 : సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్ సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన పెనుగోలు కాలనీకి చెందిన ఆశ కార్యకర్త ఉయిక సమ్మక్క ఇంటికి వైద్యబృందంతో కలిసి వెళ్లారు. జిల్లా వైద్య సిబ్బంది సమకూర్చిన రూ.35,400ల నగదును సమ్మక్క కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కొమరం మహేందర్, అల్లి మధుకర్, గ్యానస, హెచ్‌ఈవో పాయం వేణుగోపాలకృష్ణ, హెల్త్‌సూపర్‌వైజర్ కోటిరెడ్డి, హెచ్‌వీ వెంకటరమణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సదస్యం

**మల్లూరులో కొనసాగుతున్న లక్ష్మీనర్సింహుడి బ్రహ్మోత్సవాలు**



సదస్యం(వేద ఆశీర్వచనం) చేస్తున్న అర్చకులు

మంగపేట, మే 14 : మల్లూరు గుట్టపై హేమాచల లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రథోత్సవం ముగిశాక బుధవారం ఆదిలక్ష్మి-చెంచులక్ష్మి అమ్మవార్ల సహిత స్వామి వారిని పల్లకీలో గుట్టపై దేవస్థానానికి తీసుకొచ్చి యాగశాలలో ఆసీనులను చేశారు. అనంతరం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు చింతామణి సెలయేటిని సందర్శించి, పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం కల్యాణమూర్తులైన శ్రీలక్ష్మీనర్సింహ స్వామి, ఆదిలక్ష్మి-చెంచులక్ష్మి అమ్మవార్లను మేళవాయిద్యాలతో యాగశాల నుంచి కల్యాణమండపంలోకి తీసుకొచ్చి పీఠలపై ఆసీనులను చేశారు. అనంతరం సాంప్రదాయం ప్రకారం రాత్రి 10గంటల వరకు సదస్యం (వేద ఆశీర్వచనం), ఉంజల్ సేవా, లక్ష్మీ హయగ్రీవ స్తోత్ర పారాయణం క్రతవులను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఈవో శ్రావణపు సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ యర్రంగారి సురేశ్, భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యుల బృందం, అర్చకులు ముక్కామల రాజశేఖరశర్మ, మురళీశర్మ, కారంపూడి పవన్‌కుమార్ ఆచార్యులు, ఏడునూతుల ఈశ్వర రామానుజ చందుశర్మ, వెంకటనారాయణశర్మ, రాజీవ్‌శర్మ, సీతారాములు, సుధీర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మహాఅన్నదానం

మల్లూరు గుట్టకు బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు బుధవారం ములుగు జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మహా అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంతుల కృష్ణమూర్తి, జిల్లా కోశాధికారి పాలడుగుల చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు సిద్ధంశెట్టి కనకారావు, మండల కోశాధికారి సింగిరికొండ శ్రీనివాస్, నెరెళ్ల శ్రీనివాస్, బచ్చు రామ్మోహనరావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565